క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



ఇందుకూరుపేట: సేవా పక్షోత్సవాల్లో భాగంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బిస్కెట్లు ఆస్పత్రికి అవసరమైన దుప్పట్లను పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిషన్ సభ్యులు ఎన్.శ్రీనివాసులురెడ్డి, పి.రామ్‌భూపాల్‌రెడ్డి, టి.లక్ష్మీనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 54 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభమయ్యాయని డీసీఓ గుర్రప్ప తెలిపారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీలో జిల్లాలోని పీఏసీఎస్‌ల సీఈఓలకు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లాలోని 41 పీఏసీఎస్‌ల ద్వారా 54 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,11,703 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్ కుమార్, డీసీసీబీ జనరల్ మేనేజర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

నెల్లూరు సిటీ: ఓ వృద్ధుడు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో ఒంటి నొప్పులు భరించలేక బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రూరల్ మండలంలోని పాతవెల్లంటి గ్రామంలో పెద్ద అంకయ్య(84) నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గత కొంత కాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఒంటి నొప్పులు తీవ్రంగా రావడంతో భరించలేక శుక్రవారం గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గుర్తించి హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం కూడా చెల్లించవచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ రాఘవేంద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేస్తాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాచ్‌మెన్‌పై బీర్ బాటిల్‌తో దాడి

నెల్లూరు(క్రైమ్): నైట్ సేల్స్ లేవన్నందుకు ఇద్దరు వ్యక్తులు వాచ్‌మెన్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్‌షాపులో మురళి వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై షాపు వద్దకు వచ్చారు. మద్యం కావాలని వాచ్‌మెన్‌ను అడగ్గా నైట్ సేల్స్ లేవని చెప్పడంతో వారు గొడవకు దిగారు. సమీపంలో రోడ్డుపై ఖాళీగా పడి ఉన్న బీర్‌బాటిల్ తీసుకుని వాచ్‌మెన్‌పై దాడి చేశారు. గాయాలపాలైన మురళి ఈమేరకు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుల గురించి ఆరా తీస్తున్నారు.

ఆస్పత్రులకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి క్లినిక్, హాస్పిటల్స్ ట్రేడ్ లైసెన్సులు తప్పకుండా తీసుకోవాలని, బకాయిలున్న వారు పూర్తిగా చెల్లించాలని నగరపాలక కమిషనర్ నందన్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్(ఏఐఎంఏ) సభ్యులకు తెలియజేశారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఏఐఎంఏ సభ్యులు, డాక్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ట్రేడ్ లైసెన్సులు పొందని వారు వెంటనే తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్సుల బకాయిలు రూ.36 కోట్లు ఉన్నాయన్నారు. కాగా ఏఐఎంఏ సభ్యులు కొన్ని సమస్యలను కమిషనర్ దృష్టికి పరిశీలించి పరిష్కరిస్తామని తెలియజేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, డాక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నక్షపై సమీక్ష

నక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నందన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో నిర్వహించారు. నక్ష ద్వారా నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో చేపడుతున్న సర్వే ప్రోగ్రామ్‌లో వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, అడ్మిన్ కార్యదర్శులు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు సంయుక్తంగా పాల్గొని సమన్వయంతో అన్ని అంశాలను అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలోపు నక్ష ప్రోగ్రామ్‌ను పూర్తి చేయాలని, ఆయా జియో గ్రాఫికల్ వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా డేటాను సమర్పించాలని తెలిపారు. సిటీ ప్లానర్ హిమబిందు, వార్డు సచివాలయ ప్లానింగ్ కో–ఆర్డినేషన్ టీమ్, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొదలకూరు: గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి



పొదలకూరు: మరుపూరులో లలితా త్రిపురసుందరి అలంకారం



తోటపల్లిగూడూరు: మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి



మనుబోలు: లలిత త్రిపురసుందరి అలంకారంలో..



పాహిమాం.. రక్షమాం

పొదలకూరు: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. విశేషాలంకారాల్లో కొలువైన జగజ్జననిని భక్తులు దర్శించుకుంటున్నారు.

- పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు ధాన్యలక్ష్మిగా దర్శనమిచ్చారు.
- పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిగా దర్శనమిచ్చారు. లలితసహస్రనామార్చన, ఖడ్గమాల తదితర పూజలను నిర్వహించారు.
- మండలంలోని మరుపూరులో గల కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారు లలితాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మైలా రామచంద్రారెడ్డి దంపతులు తదితరులు వ్యవహరించారు.
- ఇనుకుర్తిలోని కాంతమ్మ తల్లి ఆశ్రమంలో అమ్మవారు పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

తోటపల్లిగూడూరు: నరుకూరులోని ఇందిరా కాలనీలో కొలువైన రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.

- వరిగొండలోని దేవళాలమిట్టలో కొలువైన జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేషాభిషేకాలను నిర్వహించారు. నవావరణ పూజను సాయంత్రం జరిపారు. ఉభయకర్తలుగా కొండ్రాయుడు, అన్నం రామచంద్రయ్య వ్యవహరించారు.

మనుబోలు: స్థానిక కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. సామూహిక కుంకుమార్చనను నిర్వహించారు. ఉభయకర్తలుగా నాసిన శివయ్యగౌడ్, బాగ్యలక్ష్మి వ్యవహరించారు.

- ఇందుకూరుపేట: శరన్నవరాత్రుల సందర్భంగా గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో శనివారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. రాత్రి పల్లకీసేవ వేడుకగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయదాతలుగా కందిమల్ల రాజ సుధీర్‌నాయుడు, లక్ష్మీ సరస్వతి వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షి తాయి ఆలయంలో శనివారం అమ్మవారు భండాసురవధ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశ పూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మహా నవావరణ పూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



ఇందుకూరుపేట: పల్లకిసేవలో అమ్మవారు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కోలాటం ఆడుతున్న మహిళలు

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి డిప్యుటేషన్ పంపించారు. ఈ మేరకు నెల్లూరు ఆర్డీఓ అనూష ఆదేశాలు జారీ చేశారు.

గొలగమూడిలో విశేష పూజలు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి ఆశ్రమాన్ని భక్తులు శనివారం దర్శించుకున్నారు. ఆశ్రమం చుట్టూ ప్రదక్షిణలు చేసి వెంకయ్యస్వామిని దర్శించుకొని, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ నిత్యాన్నదానశాలలో అన్న సంతర్పణ చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో నివాసం ఉంటున్న హరిప్రసాద్ పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరు మండలం పంటపాళెం వెళ్లారు. తిరిగెళ్తుండగా, సర్వేపల్లి సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. క్షతగాత్రుడ్ని నెల్లూరు తరలించారు.

విజిలెన్స్ విచారణతో కాలయాపన

పొదలకూరు: విజిలెన్స్ విచారణతో పేదలకు చెందిన పక్కా గృహాల నిర్మాణ పనులు నిలిచిపోయాయని, కాలయాపన చేయకుండా వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. మండలంలోని పులికల్లు గిరిజన కాలనీలో అర్థాంతరంగా నిలిచిపోయిన పక్కా గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వీటిని పూర్తి చేసేలా సహకరించాలని కోరారు.

గంగపట్నంలో పౌర హక్కుల దినం



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం గ్రామంలో పౌర హక్కుల దినం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ గోపీకృష్ణ రాజ్యాంగ హక్కుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్సై నాగార్జునరెడ్డి, ఎంఈఓ సునీల్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పోలు రఘు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్, మాల మహానాడు అధ్యక్షుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



కోవూరు: నెల్లూరు రూరల్ పరిధిలోని నరసింహకొండలో కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరు ప్రమీలమ్మ, సుబ్రహ్మణ్యంల కుమారుడి వివాహం శనివారం జరిగింది. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, వధూవరులు వినేష్– శిరీషలను ఆశీర్వదించారు. పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, జిల్లా వలంటీర్ల విభాగం కార్యదర్శి కవరగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



ఇందుకూరుపేట: పరిశుభ్రతను అందరి బాధ్యతగా నిర్వర్తించాలని ఆర్డీఓ అనూష అన్నారు. తీర ప్రాంత శుభ్రత కార్యక్రమంలో భాగంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో మండలంలోని మైపాడు బీచ్‌లో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణాధికారి అశోక్‌కుమార్, ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



బంతిపూల తోటను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్

మనుబోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మనుబోలు తూర్పు డొంకలోని పొలాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న బంతిపూల తోటను శనివారం ఆయన పరిశీలించారు. పంటల వివరాలను ఆరాతీశారు. రైతులు మధురెడ్డి, చంద్రయ్యకు సూచనలు చేశారు. అనంతరం దశపరణి కషాయ పిచికారీని పరిశీలించారు. డీఎమ్మెమ్టీ వరలక్ష్మి, ఎమ్టీలు గీత, పవన్ తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా వాహనమిత్ర ఇవ్వాలి



నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లకు షరతుల్లేకుండా వాహనమిత్ర పథకం ఇవ్వాలని ఆటో కార్మిక సంఘం నగర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మసెంటర్ నుంచి వీఆర్సీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 31వ తేదీ నాటికి ఆటో, మోటార్ క్యాబ్, మాక్సీ క్యాబ్‌లు యాక్టీవ్‌గా ఉండి, లైసెన్స్ కలిగి, ఏపీలో రిజిస్టర్ అయి, ఆదాయ పన్ను చెల్లింపుదారునిగా ఉండకుండా, మూడెకరాల తడి భూమి, మున్సిపల్ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగు కంటే ఆస్తి ఉండకూడదు వంటి 16 రకాల నిబంధనలు పెట్టడంతో అనేక మంది ఈ పథకానికి దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ పథకానికి ఎలాంటి షరతులు లేకుండా లైసెన్స్ కలిగిన ప్రతిఒక్కరికీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, బాబు, సీఐటీయూ, ఆటో కార్మిక సంఘం నాయకులు కత్తి శ్రీనివాసులు, సూర్య నారాయణ, శ్రీనివాసులు, ప్రేమ్‌నివాస్, లక్ష్మీపతి, జహీర్, రమణయ్య, రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా



పొదలకూరు: పట్టణంలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను ఏపీఎస్సెస్డీసీ, సోమిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం మాట్లాడారు. 14 కంపెనీల్లో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు మేళాను ఏర్పాటు చేయగా, 254 మంది హాజరయ్యారని, వీరిలో 125 మందికి అపాయింట్మెంట్ లెటర్లను అందజేశామని వివరించారు. ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించి.. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

ప్రయాణం.. నరకప్రాయం

నెల్లూరు సిటీ: ప్రైవేటు ఇంటర్ కళాశాలలకు శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో సుదూరు ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు పోటెత్తారు. భారీగా విద్యార్థులు చేరుకోవడంతో ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం కిటకిటలాడింది. దసరా సెలవులు కావడంతో వేల సంఖ్యలో ప్రయాణికులు ఊర్లకు వెళ్తుండగా, విద్యార్థులు కూడా వందల సంఖ్యలో ఉండడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా కడప, బద్వేల్, మర్రిపాడు, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాలకు వెళ్లేవారు అధిక సంఖ్యలో పడిగాపులు కాశారు. ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడం, తగిన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు సాయంత్రం వరకు ఆర్టీసీ బస్టాండుల్లో వేచి చూశారు.

ప్రైవేటు వాహనాల్లో..

ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేందుకు సీట్లు కూడా ఖాళీ లేకపోవడంతో కొందరు విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఆటోల ద్వారా వివిధ ప్రాంతాలకు ఆటోల్లో మారుతూ ఇళ్లకు చేరుకున్నారు. ఆర్టీసీ అధికారులు కనీసం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై ఒరిగిన చింతచెట్టు

- విద్యుత్ స్తంభాన్ని పెకిలించుకొని పడిన వైనం
- వృద్ధురాలికి గాయాలు
- తప్పిన పెను ప్రమాదం



విద్యుత్ స్తంభంతో సహా రోడ్డుకడ్డంగా పడిన చింతచెట్టు

కొడవలూరు: ఓ చింతచెట్టు విద్యుత్ స్తంభాన్ని పెకిలించుకొంటూ రోడ్డుకడ్డంగా విరిగి పడడంతో ఓ వృద్ధురాలికి గాయాలవ్వడంతో పాటు వాహన రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండలంలోని నార్తురాజుపాళెం నుంచి కొడవలూరు వెళ్లే రోడ్డులో శనివారం చోటుచేసుకొంది. ఇక్కడ రోడ్డు పక్కనే ఎన్నో ఏళ్లుగా వేపుగా పెరిగి ఉన్న చింతచెట్టు శనివారం నాటి స్వల్ప గాలులకే మొదలు వరకు విరిగి రోడ్డుకడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో స్థానిక దళితవాడకు చెందిన ఓ వృద్ధురాలు అటుగా వెళ్తుండగా విరిగి పడిన చెట్టుకొమ్మ తలకు తగిలింది. తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. వెంటనే ఆమెను హుటాహుటిన ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. కాగా విద్యుత్ స్తంభాన్ని పెకిలించుకొంటూ చెట్టు పడగా, ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండడంతో స్థానికులు సిబ్బందికి సమాచారమిచ్చి సరఫరాను నిలిపివేయించారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. నార్తురాజుపాళెం నుంచి కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లే రోడ్డు కావడంతో నిరంతరం వాహన రాకపోకలుంటాయి. చెట్టు విరిగి పడిన సమయంలో ఓ ఆటోకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విద్యుత్ స్తంభాన్ని పెకిలించుకొని చెట్టు పడిపోవడంతో సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని నిలిపివేశారు. రెండు గంటల పాటు శ్రమించి చెట్టును తొలగించి ఆ ప్రాంతం మినహా మిగిలిన చోట్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్తంభంతో పాటు విద్యుత్ తీగలను సరిచేసి గ్రామమంతా సరఫరాను పునరుద్ధరించేందుకు సాయంత్రం వరకు సమయం పట్టింది.

పలువురికి ప్రసన్న పరామర్శ



కోవూరు: సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

కోవూరు: మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ వార్డు సభ్యుడు పచ్చిపాల సుధాకర్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో ఆయన ఉత్తరక్రియలు శనివారం వారి నివాసంలో జరగ్గా, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు చెంచురెడ్డి, జిల్లా యువజన విభాగం సెక్రటరీ సాయిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు భీమతాటి శ్రీధర్, నాయకులు గయాజ్, వెంకటరమణారెడ్డి, సుబ్బారెడ్డి, శివకుమార్‌రెడ్డి, వార్డు సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడూరు ప్రభాకర్‌రెడ్డిని మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కొమరిక గ్రామంలోని తన నివాసానికి వెళ్లి కుమారులు శివకుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డిలతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్న

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డాక్టర్ కామాక్షయ్య

కొడవలూరు: కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య తెలిపారు. 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండవరంలో శనివారం మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఓరల్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందన్న ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాజకుమారి, ఉపసర్పంచ్ ఆలం మాలకొండయ్య, నీటి సంఘం అధ్యక్షుడు కంచి ఈశ్వర్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.